# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





-23-

# అమెరికారోగ్యం కకావికలం కథ




ఏ ముహూర్తాన గత ఏడాది లాస్ వేగస్ వెళ్ళానో ...అదిగో అప్పటి నించీ నా శరీరం అంతా కకావికలంగా తయారు అయింది. అలా అని వేగస్ లో మేరిలిన్ మన్రో తో కాస్త కులాసా (కావాలంటే ఆ ఫోటో ఇక్కడ చూడండి....) అలాగే కేసీనోలో బ్లాక్ జాక్ వగైరా నా అమెరికులాసా పనులు మాన లేదు కానీ ఇది వరకూ ఎప్పుడూ లేనిది నాలుగు అడుగులు వెయ్యగానే అమెరికాళ్ళ నొప్పులు మొదలెట్టి మరో నాలుగు అడుగులు వెయ్యగానే అవి నడుం నొప్పిగా మారి భలే ఇబ్బంది పడడం మొదలయింది. పైగా నడుస్తున్న కొద్దీ ఆయాసం పెరగడం మొదలయింది. ఈ యవ్వారాలు నచ్చక నేను వేగస్ నుంచి హ్యూస్టన్ వెనక్కి వెళ్ళగానే మా అమెరికార్డియాలజిస్ట్ దగ్గరకి వెళ్లాను. ఆయన ముందు నా అమెరికాళ్ళు చూసి "గురువు గారూ, మీకు ఒంట్లో నీళ్ళు నిలవ అయిపోయి కాళ్ళ వాపు పెరిగి ఇలాంటి ఇబ్బందులు వస్తున్నాయి" అన్నాడు.

"ఓరి నాయనోయ్. ఆ నీళ్ళు బయటకి పోడానికి కుండకి నాలుగు వేపులా కన్నాలు పెట్టినట్టు నా ఒంట్లో కూడా కొన్ని కన్నాలు పెట్టి క్రింద కుండ కానీ పెడతాడా అని భయపడి చచ్చాను. అయితే ఆయన నవ్వేసి "ఆ హైడ్రాలిక్స్ టెక్నాలజీ ఇక్కడ పనికి రాదు గురువు గారూ" అని లేసిక్ అనే మాత్రలు ఇచ్చి, ఒంట్లో నీళ్ళు పిడిచేసి గుండె పోటు అనగా బి. పి. తగ్గించి ఆయాసం తగ్గించాడు. ఈ తతంగానికి పది వేలు రొఖ్ఖం మరియు పది రోజులు సమయం పట్టాయి. అయినా ఎంకి పెళ్లి తప్పింది కానీ సుబ్బి చావు తప్ప లేదు. అనగా ఆయాసం తగ్గింది కానీ నాలుగడుగులు వెయ్యగానే అమెరికాళ్ళ నెప్పులు, మరో నాలుగడుగులు వెయ్యగానే నడుం నొప్పి రావడం మాన లేదు.

"బాబూ, కార్డియాలజిస్టూ, ఇదేదో కార్డియాలజీ సమస్య కాదు. మరేటో ఉంది, చూడు" అని అడగ్గానే "మనది గుండెకాయ డిపార్ట్ మెంట్ మాత్రమే. ఆ మరేటో మన డిపార్ట్ మెంట్ కాదు." అని నన్ను ఒక న్యూరాలజిస్ట్ దగ్గరకి పంపించాడు మా అమెరికార్డియాలజిస్ట్. ఈ నరాలజిస్ట్.....అంటే న్యూరాలజిస్ట్ ఆవిడ అమెరికన్నడం పడతి. అంచేత అందచందాలు సొగసుగానే ఉన్నాయి. ఆవిడ నా సోది అంతా ఐదు

నిముషాలలో విని, విలాసంగా తల ఎగరేసి "నీ మాయ రోగం నాకు తెలుసులే. ఇలాంటి కేసులు చాలా చూశాను. దాని పేరు లంబర్ స్పైనల్ స్టెనోసిస్ అనేసి ఇంకా నా నోరు తిరగని మరో మాట కూడా కలిపి, నా ఒంటి మీద తన చెయ్యి వెయ్యకుండానే సునాయాసంగా చెప్పేసింది. లంబర్ అంటే చెట్ల నుంచి కొట్టిన చెక్క ముక్కలు అని నాకు తెలుసు కానీ మన శరీరంలో కూడా లంబర్ ఉంటుంది అని ఆవిడ విశదీకరించి చెప్పే దాకా లంబర్ లో కూడా ఇన్ని రకాలు ఉంటాయి అని నాకు తెలియ లేదు. పైగా ఇది కాస్త ఈ లంబర్ వలన నొప్పి వయసు వచ్చిన వాళ్ళలో చాలా మందికి వస్తుంది అనీ, ఆ నొప్పి తగ్గించే మార్గాలు మూడు ఉన్నాయి అనీ అక్కడ గోడ మీద బొమ్మలు చూపించి క్లాసు పీకింది. కానీ ముందు వెన్నెముక ఎమ్మారై చేసి అప్పుడు ఏం చెయ్యాలో నిర్ణయిద్దాం అనీ, అంత వరకూ ఎక్కువ నడవకుండా నిటారుగా కూచోమని లేదా అడ్డంగా పడుకోమని చెప్పేసి మరో నడుం నొప్పి పేషెంట్ ని చూడడానికి వెళ్ళిపోయింది ఈ అమెరికన్నడ నరాల డాక్టరమ్మ.

ఒక వారం తర్వాత ఆ ఎమ్మారై చూసి "నేను ముందే చెప్పానుగా" అనేసి ముందు ట్రీట్ మెంట్ గా మూడు వారాలు ఫిజికల్ థెరపీ చేయించుకో అని ఆర్డర్ వేసింది. "సరే" అని నేను లేచి వెళ్ళబోతూ ఉంటే "అమెరికాలో మంచి ఆవకాయ, గోంగూరా ఎక్కడ దొరుకుతాయో నీకు తెలుసునా?" అని మొహమాటంగా అడిగింది ఆ అమెరికన్నడం ఆవిడ తెలుగులో. లోపాయికారీ విషయం ఏమిటంటే ఆవిడకి ఆ రెండూ ఎంతో ఇష్టంట కానీ కన్నడ మొగుడికీ, ఇక్కడే పుట్టి పెరిగిన అమెరికన్-కన్నడ పిల్లలకీ అవి అసలు చూడగానే కళ్ళమ్మట నీళ్ళు వచ్చేస్తాయి కాబట్టి అప్పుడప్పుడు తను మాత్రమే తినడానికి అసలు సిసలు ఆంధ్రా ఊరగాయలు కొనుక్కోవాలని ఆవిడ కోరిక. చెప్పొద్దూ. ఆ మాట మొదటి రోజే అడిగి ఉంటే మా గరాజ్ లో ఉండే ఫ్రీజర్ లో గత ఏడాది నుంచీ ఉన్న ఆవకాయ, గోంగూర, చింత కాయ, కొరివి కారం, మాగాయ ,,ఒకటేమిటి అన్నీ తలో పొట్లాం పట్టుకెళ్ళి ఇచ్చేసి, ఫీజు ఇవ్వడం మానేద్దును కదా అని నాకు భలే కోపం వచ్చింది. ఆ మాటే అనగానే అమెరికాలో డాక్టర్లు ఫీజు బదులు ఆవకాయ సీసాలు పుచ్చుకోవడం ట్రంప్ గారు ఒప్పుకోరు అని చెప్పి తప్పించు కోగానే సరేలే అని నాకు తెలిసిన ఒక వెబ్ సైట్ పేరు ఆవిడకి చెప్పాను.

ఏమైతేనేం, మూడు వారాలు తను మాత్రం కుర్చీలో హాయిగా కూచుని నన్ను మటుకు నుంచో పెట్టి, వెల్లకిలా పడుకో పెట్టి, పెద్ద బంతితో ఆటలాడించి, కాళ్ళు చేతులు ఎడా పెడా ఊపించి ఒక కండల వీరుడైన ఫిజికల్ థెరపీ కుర్రాడు మూడు వారాలు ఎంత తంటాలు పడినా మన పని ఎక్కడి గొంగళీ అక్కడే. నొప్పులు తగ్గ లేదు సరి కదా. కొత్త నొప్పులు రావడం మొదలెట్టాయేమో అని అనుమానం వేసి సదరు ఆవకాయ డాక్టర్ ని పిలిచాను.

"యస్. నువ్వు చెప్పిన ఆవకాయ్ వెబ్ సైట్ బావుంది. ఐదు పొట్లాలు తెప్పించు కోగా ఇంకా రెండు మిగిలాయి. చాలా థాంక్స్. ఇంతకీ ఎందుకు పిలిచావు?" అంది ఆవిడ ఆవకాప్యాయంగా.

"ఎందుకేమిటీ. ఆ ఫిజికల్ థెరపీ అంతా ఓవర్ యాక్షనే కానీ మరో మాట చెప్పు" అన్నాను.

"ఓస్, అంతేనా. అది పనిచెయ్యదేమో అని నాకూ అనుమానం వచ్చిందిలే. ఇక తర్వాత ట్రీట్ మెంట్ వెన్నెముకలో సూది మందు ఇద్దాం" అంది ఆవిడ యాదాలాపంగా.

"ఏమిటి, నా వెన్నెముకలో ఇంజెక్షన్ ఇస్తావా?" నా గొంతు గజ గాజా వణికింది.

"భలే వాడివే. నీకు నొప్పులు వస్తే నాకెందుకు వెన్నెముకలో ఇంజెక్షనూ. సాక్షాత్తూ నీకే" అని ఆవిడ ఫెళ ఫెళా చచ్చు నవ్వు నవ్వేసి "పవన్ గ్రోవర్ అనీ, మన వాడే. అతనే ఇలాంటివి రోజూ చేస్తూ ఉంటాడు. ఈ పాటికి కొన్ని వేల పోట్లు కళ్ళు మూసుకుని పొడిచి ఉంటాడు. నీ వెన్నెముకలో చిట్ట చివర ఎముకలకీ నరాలకి ఉరుసుకుని నొప్పి రాకుండా ఉండడానికి మధ్యలో ఇంజెక్షన్ ద్వారా స్టెరాయిడ్ మందు ఎక్కిస్తాడు. సింపుల్ ప్రొసీజర్". దాన్నే పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటం అంటారు. ఇక్కడ పవన్ గారు పిల్లి. మనం ఎలక..ముచ్చెం మూడు సార్లు. ఆ ఇంజెక్షనల తాలూకు నరసమ్మ తో ఓ సరదా ఫోటో ఇక్కడ జతపరిచాను.

ఈ ఇంజెక్షన్ రెండు వారాలకి ఒక సారి చొప్పున మూడు సార్లు ఇస్తారుట. మొదటి సారి ఈ పవన్ గ్రోవర్ ని చూడగానే నన్ను గుర్తుపట్టేశాడు. ఎందుకంటే ముప్ఫై ఏళ్ల క్రితం కుర్ర డాక్టర్ గా చాకులా ఉండేటప్పుడు అతను అలనాటి సినీ నటి మీనాక్షి శేషాద్రి ని డేటింగ్ చేసే వాడు. పైగా అతను నడిపే సౌత్ ఏషియన్ టీవీ అనే టెలివిజన్ షో లో నేను కామెడీ షోలు చేసేవాడిని. చూస్తే వాడికి అప్పటి డేటింగ్ వర్క్ ఔట్ అయినట్టు లేదు. ఇప్పుడు నా మొహంలా ఉన్నాడు. అయినా నికలస్ పేజ్ లాంటి వాళ్ళతో హాలీవుడ్ సినిమాలలో వేస్తున్నాడు. ఒక సినిమా స్టూడియో కూడా ఉంది.

ఏమైతేనేం కాస్సేపు అప్పటి కబుర్లు చెప్పుకుని మేం ఇద్దరం మొదటి విడత వెన్నెముక పోటుకి సిద్ధ పడిపోయాం. అంటే వెన్నెముక నాది. పొడవడం వాడిది. "ఇదిగో కళ్ళు మూసుకుని పొడవకు" అని ముందే వార్నింగ్ ఇవ్వగానే నవ్వేశాడు. మొదటి ఇంజెక్షన్ నాటి ఫోటోలు రెండు ఇక్కడ జతపరిచాను..సరదాకి. ఇక అసలు సంగతికి వస్తే ఈ మూడు వెన్నెముక ఇంజెక్షన్లు అయ్యాక వారం రోజుల్లో మెల్ బోర్న్ లో సాహితీ సదస్సుకి వెళ్ళాను. అక్కడ మెల్ బోర్న్ లో సదస్సు తరువాత కైర్న్స్, సిడ్నీ, కేన్ బెర్రా నగరాల లో పది రోజుల పర్యటన తర్వాత హ్యూస్టన్ వచ్చి చేరాను. ఆ హడావుడిలో ఈ ఇంజెక్షన్ల గొడవ మార్చే పోయాను.

ఈ సినిమాలో ఇంత వరకూ ఇంటర్వెల్ అనమాట. అసలు సినిమా ఇప్పుడు మొదలయింది.

ఇక హ్యూస్టన్ వచ్చిన నాడు మధ్యాహ్నం నుంచి మర్నాడు పొద్దుట పది దాకా విశ్రమించి, హాయిగా ఒక మూడు గంటలు ఆఫీసుకి వెళ్ళి బకాయి బిల్లులు కట్టుకుని ఇంటి కొచ్చి మళ్ళీ పడుకున్నాను. అంతా సిడ్నీ నించి 15 గంటలు ఏకదాటీ విమాన ప్రయాణం తాలూకు జెట్ లాగ్ అనే అనుకున్నాను. రాత్రి పదింటికి మా మనవరాలికి కొన్న రెండు ఆస్ట్రేలియా బొమ్మలు మా క్వీన్ విక్టోరియాకి చూపించి, ఆవిడ అర్ధ రాత్రి కూలి పనికి వెళ్ళగానే నేను రిమోట్ తీసుకుని తెలుగు టీవీ లో అరుపుల, కేకల చర్చా వేదిక పెట్టాను. మహా అయితే పది నిముషాలు చూసిన జ్ఞాపకం. అంతే.....బ్లాక్ ఔట్! ప్రపంచం అంతా మాయం అయిపోయింది!

మరో ఐదు గంటల తర్వాత....ఎదురుగుండా గోడ మీద గడియారం సుమారు రాత్రి 3 గంటలు చూపిస్తోంది. కాస్త మెళకువ వచ్చింది. చూస్తే మా టీవీ ముందు నేల మీద అచేతనంగా పడి ఉన్నాను. లేవబోతే నా వల్ల కాలేదు. కాళ్ళు, చేతులు ఆడుతున్నాయి కానీ వశంలో లేవు. మొత్తానికి లేచి కూచోగలిగాను. నా మట్టి బుర్రకి అప్పుడైనా 911 ని పిలవాలని తోచ లేదు. తోచి ఉంటే ఎలాగో అలాగా ఒక పది అడుగుల దూరంలో బల్ల మీద ఉన్న సెల్ ఫోన్ దాకా పాక్కుంటూ వెళ్ళేవాడిని. అలా తోచక, ఆ పది అడుగులూ పక్క గదిలో ఉన్న మా మాస్టర్ బెడ్ రూమ్ లోకి పాక్కుంటూ వెళ్లి మంచం మీదకి ఎలాగో అలా ఎక్కి పడుకున్నాను. ఈ సారి మెళకువ వచ్చే సరికి పొద్దున్న ..అనగా ఆస్ట్రేలియా నుంచి వెనక్కి వచ్చిన రెండో రోజు పొద్దున్న పది అయింది. కొంచెం ఇబ్బంది అయినా మామూలుగా అలవాటు అయిన ఒళ్ళు నొప్పులతో లేచి బాత్ రూమ్ కి వెళ్లి అద్దం లో చూద్దును కదా....నా గుండె ఆగిపోయింది. అంటే నిఘంగా కాదు. నిఘంగా అయితే ముందు రోజు రాత్రే ఆ పని అయిపోను. కానీ మహేష్ బాబు విలన్ గాడి సైడ్ కిక్కు గాడిని కొట్టినట్టు అద్దంలో నా ఎడం కన్ను మొత్తం నలుపు, ఎరుపు, కాషాయం రంగులతో పూర్తిగా మూసుకు పోయి, రెండు కళ్ళ క్రిందా పెద్ద నల్ల చారలతో కనపడి ఏకాక్షిలా ఒక కుడికన్నుతో మాత్రమే నా అందచందాలు చూసుకోగాలిగాను. ఎక్కడా ఏ విధమైన నొప్పీ లేదు.

"ఏమి ఈ వైపరీత్యము" అని వెంటనే మా కంటి డాక్టర్ ని పిలిచి అర్జంటు ఎపాయింట్ మెంట్ తీసుకుని నేనే పది మైళ్ళు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. ఆ అమ్మాయి ఆ దెబ్బకి కుదేలు అయిపోయి, అదెలా తగిలిందో నేను అస్సలు చెప్పలేక పోతున్నందుకు మరింత కుదేలు అయి పోయి రక రకాలద్రవ్యాలతో నా ఎడం కన్ను శుభ్రం చేసి, కంటి రెప్పలు తెరిచి మొత్తానికి నా చూపు ఇంచుమించు మామూలు కు వచ్చేలా చేసింది. ఈ తతంగం అయ్యాక "నీకు చాలా పెద్ద దెబ్బ తగిలింది. అర్జంటుగా ఎమర్జెన్సీ కి వెళ్లి పూర్తిగా చూపించుకో. ఖచ్చితంగా మెదడుకీ, ఇతర శరీర భాగాలకే కూడా దెబ్బలు తగిలే ఉంటాయి." అని ఘట్టిగా వార్నింగ్ ఇచ్చి నేను మొరాయించ బోతూ ఉంటే పోలీసులని పిలుస్తుందేమో అని అనుమానం వచ్చింది. నేను కూడా కాస్త ఆలోచించి అక్కడికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న ప్రఖ్యాత మెథడిస్ట్ హాస్పిటల్ ఎమర్జెన్సీ కి నేనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లి, పార్క్ చేసుకుని నడిచి ఎమర్జెన్సీ కి వెళ్లి "ఇది ఎమర్జెన్సీ యేనా, ఇక్కడ చేరాలంటే ఏం చెయ్యాలి" అని అడగగానే అక్కడ నల్ల పిల్ల ఆశ్చర్య పోయింది. పక్కనే ఉన్న తెల్ల పిల్ల కేవలం నా పుట్టిన రోజు అడిగి, అర క్షణం లో నా ఆరోగ్య జాతకం అంతా చదివేసి చిన్న గంట కొట్టగానే మరో క్షణంలో ఓ చక్రాల కుర్చీలో నన్ను హాస్పిటల్ ఎమర్జెన్సీ లో పక్క మీద పడుకోబెట్టేశారు.

అప్పటి నుంచీ అంతే సంగతులు....అసలు ఏమవుతోందో తెలిసే లోగా సిటి స్కాన్, ఎక్స్ రే, ఐవీ పెట్టెయ్యడం, రక్తం పీల్చెయ్యడం, అల్ట్రా సౌండ్,...ఒకటేమిటి...అచ్చు సినిమా లలోగా..మన సినిమాలు కాదు, అమెరికా వాళ్ళ వి...నానా పరీక్షలూ చేసి పారేశారు. పోనీ లే ఏదో ముచ్చట పడుతున్నారు అని అనుకుంటుంటే "నీకు నీ వాళ్ళు ,,అంటే భార్యా, పిల్లలూ ఎవరైనా ఉన్నారా? వాళ్లకి చెప్పాలి" అని ఒ నర్సు అనగానే నాకు చెమట్లు పట్టేశాయి. అవును కదా. నేను ఇప్పుడు ఎమర్జెన్సీ లో ఉన్నట్టు ఎవరికీ తెలీదు కదా.

సరిగ్గా అదే సమయానికి మా అర్ధాంగి ఫోన్ చేసి "ఎక్కడున్నావ్? నీ లాప్ టాప్ ఇక్కడే సోఫా మీద ఉంది, వర్క్ కి వెళ్ళ లేదా" అని అడిగింది. "ఇక్కడే సరదాగా మెథడిస్ట్ హాస్పిటల్లో ఉన్నాను అని చెప్పేస్తే ఆవిడ హడిలి పోయి తను కూడా ఇంకో ఎమర్జన్సీ కి వెళ్ళిపోయే అవకాశం ఉంది కాబట్టి "అబ్బే, చిన్న పని మీద పోస్ట్ ఆఫీసుకి వచ్చాను. గంటలో ఇంటికి వచ్చేస్తాను అని ఎలాగా ఒక గంటలో ఇంటికి వెళ్ళిపోతాం కదా అని నిజంలా వినబడే అబద్ధం ఆడేసి మా నర్సు కేసి చూసి "కదా" అన్నాను. "కాదు" అని ఆ పిల్ల తల నిలువుగా ఊపి "ఇప్పుడేగా చేరావు. అన్ని టెస్ట్ లూ అయ్యాక, డాక్టర్లు చూశాక ఇంటికి పంపించడానికి కనీసం రెండు రోజులు పడుతుంది" అంది. అదే కేరళ నర్సు అయితే తల అడ్డంగా ఊపును కాబట్టి ఈ పిల్ల తెల్ల నర్సు అనీ వేరే చెప్పక్కర లేదు. అదే నల్ల నర్సు అయితే బహుశా నా తల గుండ్రంగా తిప్పునేమో తెలియదు. ఏమైతేనేం అప్పుడు నాకు విషయం పూర్తిగా అర్ధం అయి మా ఇంటికి గంటన్నర దూరంలో నర్సు ఉద్యోగం చేస్తున్న మా పెద్దమ్మాయిని పిలిచి విషయం అంతా చెప్పాను. తను వెంటనే శలవు పెట్టి, మా ఇంటికి వెళ్లి మా ఆవిడ కంగారు పడకుండా సావకాశంగా విషయం చెప్పి, ఇద్దరూ కలిసి ఎమెర్జెన్సీ లో ఉన్న నన్ను చూడడానికీ, మరియు కాస్త వంకాయ కూర పట్టుకురావడానికీ అర్ధ రాత్రి అయింది. అంటే మా క్వీన్ విక్టోరియా అర్ధ రాత్రి కూలి పని మానెయ్యాలంటే నేను ఎమెర్జెన్సీ కి వెళ్ళాలి అని నాకు అర్ధం అయింది.



మొత్తానికి అన్ని రకాల పరీక్షలూ చేసి నేను ధభీమని పడిపోడానికి కారణం మా క్వీన్ విక్టోరియా కోప్పడి తోసివేయుట కానే కాదు అనీ, నేనే వయసుకి మించిన ప్రయాణములు చేయుట, అదియునూ నా మెదడు కి ఏది రాత్రో, ఎప్పుడు పగలో తెలియని అనేక టైమ్ జోన్స్ లలో తిరుగుట వలన తల కూడా భుగోళము వలె తిరిగి ఉండవచ్చును అనియునూ, పైగా చాలా రోజులు రోజుకి రెండు లీటర్ల మంచి నీళ్ళ తాగక పోవుట వలన వలన శరీరం ఎండి పోయి ..అనగా డిహైడ్రేట్ అయిపోయి కళ్ళు తిరిగి ఉండవచ్చును అనియూ, అసలు అవేమీ కానే కాదు సుమా అనవసరంగా నేను అలనాటి మీనాక్షీ శేషాద్రిని గుర్తు చేసి, విఫలమైన ప్రేమ జ్ఞాపకాలు కెలికినందుకు కక్షగా ఆ పవన్ గ్రోవరుడు నాకు స్టెరాయిడ్ మందులో మత్తు కలిపి ఉత్తుత్తి వెన్ను పోటు పొడిచినందువలన నాకు ఈ గతి పట్టింది అనీ అందరూ తలా ఒక కారణమూ చెప్పి మెథడిస్ట్ ఎమెర్జెన్సీ వారు నన్నుడిస్చార్జ్ చేసి ఒక 15 రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోమని ఆర్డర్ వేశారు. దానికి మా అమ్మాయిలూ, అబ్బాయీ, మా ఆవిడా, బావ మరిదీ, మా అత్త గారూ, మా మనవరాలూ ...అందరూ మరో పదిహేను రోజులు కలిపి ప్రస్తుతం నెల్లాళ్ళు నన్ను ఎక్కడికీ కదలకుండా హౌస్ అరెస్ట్ చేశారు. అయితే నా ల్యాపు టాపు మీద చేసుకునే పనులకి ..అనగా ఈ హాస్య కౌముది లాంటివి వ్రాసుకోడానికి అభ్యంతరం చెప్ప లేదు కాబట్టి మరో పది రోజులు కాళ్ళకీ, ప్రయాణాలకీ విశ్రాంతి ఇచ్చినా ప్రస్తుతం లాప్ టాప్ మీద వేళ్ళు ఆడే ఐదారు సాహిత్యం పనులు ఆగవు. కానీ తెలుగు కోసం ఫైవ్ కె వాక్ అని ఎవరైనా భాషా ప్రేమికులు ఇంగ్లీషులో నడవదల్చుకుంటే నాలుగు అడుగులు తెలుగులో వెయ్యడానికి సిద్ధం!

తమాషా ఏమిటంటే ఈ వ్యాసం కనక FB లో పెడితే పొలోమని లైకులు వచ్చి పడేవో లేక గుప్పెళ్ళ కొద్దీ కామెంట్స్ గుప్పించే వారో తెలీదు. ఇక్కడ అసలు ఇలాంటివి ఎవరైనా చదువుతారో. చదివి ఏమంటారో చూద్దాం!

**COMMENTS**